సంపూర్ణ విద్య అందించే దిశగా కృషి చేయాలి

రాయదుర్గం: మూడేళ్ల కాలంలో 2023–24 నుంచి 2025–26 వరకు 15 లక్షల మంది ఫ్యాకల్టీ సభ్యులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్– మాలవ్య మిషన్ టీచర్స్ ట్రెనింగ్ సెంటర్ (యూజీసీ–ఎంఎంటీటీసీ) డైరెక్టర్ ప్రొఫెసర్ నసీమ్ ఫాతిమా స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నూతన జాతీయ విద్యావిధానం –2020పై యూజీసీ–ఎంఎంటీటీసీ ఆధ్వర్యంలో 8 రోజులపాటు నిర్వహించే అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సంపూర్ణ విద్యను అందించడం, భారత దేశం–కేంద్రీకృత నైతికత, విలువల యొక్క ఆదర్శాలను గ్రహించడం, కొత్త బోధనా పద్ధతులను రూపొందించడం, విమర్శనాత్మక ఆలోచనను అభివృద్ధి చేయడం, అభ్యాస ప్రక్రియలో ఐసీటీ సాధనాలను ఏకీకృతం చేసే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడంపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమం జనవరి 11వ తేదీతో ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు విద్యాసంస్థలకు చెందిన ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు



కేపీహెచ్‌బీ కాలనీలో అక్షింతల వితరణ కార్యక్రమంలో పాల్గొన్న రామ భక్తులు, తదితరులు



అవంతినగర్ తోటలో అక్షింతలను ఇంటింటికీ అందజేస్తున్న భజన బృందం సభ్యులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన శ్రీరాముల వారి అక్షింతలను గడపగడపకు వితరణ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా సెక్రటరీ పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు బొంత హరికృష్ణ, సుదర్శన్ ముదిరాజ్, కమ్మరి రామకృష్ణ, సిరికి శ్రీనివాస్, బొల్లు శ్రీనివాస్, ఆవుల ఆంజేయులు, ప్రసన్నాంజనేయులు, సాయిచంద్ పాల్గొన్నారు.

◆ అవంతినగర్ తోటలో భజన బృందం గడపగడపకు రామయ్య అక్షింతల వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం రాత్రి 7గంటల నుంచి 9గంటల వరకు నిర్వహించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో..

కూకట్‌పల్లి: అయోధ్యలో భగవాన్ శ్రీరాముని భవ్య మందిర నిర్మాణానికి భక్తుల నుంచి 2011లో సాత్విక భావనతో విరాళాల సేకరణ చేపట్టారు. కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన కొల్లా శంకర్, షేక్ సత్తార్, వినోద్‌కుమార్ హెన్నీ నుంచి నిధుల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ ముగ్గురిని బుధవారం శాలువాతో సత్కరించారు.

◆ ట్రస్ట్ ఆదేశానుసారం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల వితరణ కార్యక్రమం ప్రారంభించారు. కేపీహెచ్‌బీకాలనీ మూడో ఫేజు ఎల్ఐసీ ప్లాట్స్ ఒకటో నంబర్ నుంచి 46వ నంబర్ వరకు ప్రతి ఇంటికి అక్షితంత వితరణ చేశారు. ప్రజలు ఎంతో ఆనందంతో అక్షింతలను తీసుకుంటూ ఇంతటి మహాభాగ్యాన్ని అందించిన ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మరో రెండు రోజుల్లో ప్రతి ఇంటికి అక్షింతల వితరణ చేయనున్నట్లు రామభక్తులు తెలిపారు.



రామయ్య అక్షింతల వితరణలో పన్నాల హరీష్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్

'మనూ' దూరవిద్య కోర్సుల గడువు పెంపు

రాయదుర్గం: మనూలో దూరవిద్య కోర్సుల రిజిస్ట్రేషన్ గడువును పొడిగించడం జరిగిందని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ బుధవారం తెలిపారు. దూర విద్యాకోర్సులలో అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు జనవరి 10వ తేదీ వరకు అవకాశం ఉందని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకోసం 'మనూ' వెబ్‌సైట్‌ను చూడాలని ఆయన కోరారు.

డా. మహ్మద్ జావేద్ అలీకి జేసీబోస్ ఫెలోషిప్

రాయదుర్గం: ప్రతిష్టాత్మకమైన జేసీ బోస్ నేషనల్ ఫెలోషిప్–2023ని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పూర్వ విద్యార్థి డాక్టర్ మహ్మద్ జావేద్ అలీ అందుకున్నారు. నగరంలోని ఎల్‌విప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లోని డాక్రియాలజీ హెడ్‌గా అలీ పనిచేస్తున్నారు. ఆయన హెచ్‌సీయూలో ప్రొఫెసర్ నడింపల్లి శివకుమార్ మార్గదర్శకత్వంలో బయోకెమిస్ట్రీ విభాగంలో 'హ్యూమన్ లాక్రిమల్ డ్రైనేజ్ సిస్టమ్ యొక్క గ్లైకోబయాలజీని అన్వేషించడం' అనే అంశంపై పీహెచ్‌డీ డిగ్రీని పొందారు. డాక్టర్ జావేద్‌అలీ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన క్లినిషియన్–సైంటిస్ట్‌గా కొనసాగుతున్నాడు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: గురుకులాల్లో 2024 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జనవరి 6వ తేదీతో ముగుస్తుందని పటాన్‌చెరు మండలం చిట్కుల్ గురుకుల వసతిగృహం ప్రిన్సిపల్ ప్రమోద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 2023–24 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు.జనవరి 6 లోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు.ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉంటుందని తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే కృష్ణారావు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కోఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. అదే విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్లు ముద్దం నరసింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, పగుడాల శిరీష బాబూరావు, సబిహా బేగం, మహేశ్వరి శ్రీహరి, మండడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ రాములు ఉన్నారు.

నేటి ప్రపంచంలో రోబోటిక్స్‌కు ప్రాధాన్యం

నిజాంపేట్: నేటి ప్రపంచంలో రోబోటిక్స్ ప్రాధాన్యత ఎంతో పెరిగిందని.. దీనిపై చాలా దేశాల్లో విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయని బాచుపల్లి వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయరాణి అన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో జరిగే రోబోటిక్స్ ఈవెంట్స్ కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విజయరాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద రొబొటిక్స్ ఈవెంట్స్‌కు తమ పాఠశాల వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. వివిధ పాఠశాలల నుంచి 500లకు పైగా విద్యార్థులు పాల్గొననున్నారని పేర్కొనారు. ప్రతిభావంతులకు బహుమతులు అందజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డే స్కూల్ ప్రిన్సిపల్ రవి, రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ గీత తదితరులుపాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిలో శిల్పకళకు ఎంతో ప్రాధాన్యం

- దైవజ్ఞ శర్మ
- రామయ్యకు పాదుకలు తయారు చేసిన పిట్లంపల్లి రామలింగాచారికి సత్కారం



లోహశిల్పి రామలింగాచారికి మెమొంటో అందజేస్తున్న దైవజ్ఞశర్మ

ఓల్డ్ బోయిన్‌పల్లి: భారతీయ సంస్కృతిలో శిల్పకళకు ఎంతో ప్రాధాన్యం ఉందని... అందులో శిల్ప కళాకారుడు పిట్లంపల్లి రామలింగాచారి ప్రముఖులని దైవజ్ఞ శర్మ కొనియాడారు. అయోధ్య రామ మందిరంలో గర్భగుడిలో ఏర్పాటు చేసే శ్రీరాముని పాదుకలను తయారు చేసే భాగ్యం రామలింగాచారికి దక్కడం సంతోషకరమైన విషయమని తెలిపారు. బుధవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి హస్మత్ పేటలోని శ్రీమద్విరాట్ కళా కుటీర్‌లో దైవజ్ఞశర్మ రామలింగాచారిని కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి మోమెంటో అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దైవజ్ఞశర్మ మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అయోధ్య రామ మందిరంలో ఏర్పాటు చేసే శ్రీరాముని పాదుకలను తయారు చేసిన రామలింగాచారి ధర్మస్వరూపుడని కొనియాడారు. పదేళ్ల ప్రాయంలోనే శిల్ప కళపై మక్కువతో ఆ కళను నేర్చుకుని... ఈరోజు అయోధ్య రామయ్యకు పాదుకలను తయారు చేసే అదృష్టం మన భాగ్యనగరం శిల్పికి దక్కడం ఆనందంగా ఉందన్నారు.

ఆర్టీసీ కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ వి.రవీందర్

గచ్చిబౌలి: ఆర్టీసీ భద్రతలో కానిస్టేబుళ్ల విధులు కీలకంగా ఉంటాయని ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ వి.రవీందర్ పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్‌లోని టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో ఆర్టీసీ కానిస్టేబుళ్లకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని కమాండెంట్ సన్నీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావంతో పని చేయాలని సూచించారు. కమాండెంట్ సన్నీ మాట్లాడుతూ శిక్షణలో విధుల పట్ల అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, శ్రీకాంత్, టీఎస్ఆర్టీసీ ఈడీ (అడ్మిన్) మహంకాళీ, డాక్టర్ జ్యోతిరావు పూలే, డి.నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ కాంగ్రెస్‌పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షిని బుధవారం హైదర్‌నగర్ మాజీ కార్పొరేటర్ ఎం. భానుప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన దీపదాస్ మున్షికి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పార్టీలకతీతంగా అధికారులు సహకరించాలి

కూకట్‌పల్లి: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పనిచేసి ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా సహకారం అందించాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. బుధవారం బాలానగర్, ఫతేనగర్‌లలో ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ అధికారి వ్యవహార శైలి బాగుండటం లేదని బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన ఏఈ పవన్‌కుమార్‌తో మాట్లాడి అధికారులు పార్టీలకతీతంగా పనిచేయాలన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించొద్దని సూచించారు. ఫతేనగర్‌లో దరఖాస్తులు ఇప్పటి వరకు ప్రజల నుంచి ఎన్ని వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, పుష్పరెడ్డి, సతీష్ రెడ్డి, పాల్గొన్నారు.



ప్రజాపాలన కేంద్రంలో రికార్డు పరిశీలిస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్

వ్యక్తి అదృశ్యం

బాలానగర్: ఆస్పత్రికి వెళ్లి వస్తానని బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం... నవీన్, కృపారాణి దంపతులు రామిరెడ్డినగర్‌లో తమ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. నవీన్‌కు కోవిడ్ సమయంలో ఉద్యోగం కోల్పోయాడు. అప్పటి నుంచి ఇంటి దగ్గరే ఉంటున్నారు. గతేడాది డిసెంబర్ 22వ తేదీన తన స్నేహితుడి తండ్రికి ఆరోగ్యం బాగలేదని చూసి వస్తానని వెళ్లిన నవీన్ (38) ఇంటికి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య కృపారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భారీగా మత్తు పదార్థాలు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితుడు

నిందితుడి అరెస్ట్

బాలానగర్: బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఎక్సైజ్ శాఖ అధికారులు రూ.28 లక్షల విలువైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి విజయ్ భాస్కర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మత్తుపదార్థాలు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బోయినపల్లి డైరీ ఫామ్ రోడ్డులో వాహనాల తనిఖీలు చేపట్టిన పోలీసులు ఎర్టిగా కారులో తరలిస్తున్న 560 కేజీల క్లోరల్ హైడ్రేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. రామాగౌడ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతను ఇచ్చిన సమాచారం ఆధారంగా ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో సీఐలు వేణుకుమార్, నర్సిరెడ్డి, ఎస్ఐలు రఘు, శ్యాం సుందర్, రష్మిత, సలీం, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ వాల్వ్‌ల లీకేజీ

రోడ్డుపాలవుతున్న తాగునీరు



ఆస్‌బెస్టాస్ కాలనీలో మంచినీటి వాల్వ్ లీకేజీతో రోడ్డుపై పారుతున్న మంచినీరు

అల్విన్‌కాలనీ: త్రాగునీరు పైపులైన్ వాల్వ్‌లు లీకేజీతో మంచినీరు రోడ్డుపై ఏరులై పారుతున్నాయి. కూకట్‌పల్లి ఆస్‌బెస్టాస్ కాలనీ ప్రధాన రహదారిలో మసీదు వద్ద లీకేజీతో సుమారు వారం రోజులుగా నీరు వృథాగా పోతోంది. ప్రతిసారి అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేయటంతో సమస్య తిరిగి పునరావృతం అవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. తాగునీటి పైపులైన్ వాల్వ్ లీకేజీతో ప్రధాన రహదారిలో వెళ్లే దుమ్ము ధూళి చేరి కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వాల్వ్ మరమ్మతులు చేసినప్పుడే ప్రణాళికతో పకడ్బందీగా చేయాలని కోరుతున్నారు.

పంచశీల స్కూల్ కేలండర్ ఆవిష్కరణ

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్ నూతన సంవత్సర 2024 కేలండర్‌ను బుధవారం పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా మూసాపేట కార్పొరేటర్ మహేందర్, మాజీ కార్పొరేటర్ పి. బాబురావులు పాల్గొని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జిల్లా గోపాల్, మూసాపేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాయకులు కర్క పెంటయ్య, తూము శైలేష్, నపారి చంద్రశేఖర్, ఖాజా పటేల్, ఉప్పల చంద్రశేఖర్ గుప్త, చున్ను పాషా, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతపై ఆశలు

- ప్రజాపాలనలో అనధికారికంగా రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ
- కొత్త కార్డుల కోసం ఎదురు చూపులు
- ప్రతి పథకానికి రేషన్ కార్డు లింకే కారణం
- జిల్లాలో గతంలో 95,040 రేషన్ దరఖాస్తులు రిజెక్ట్


సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన సభల్లో అభయ హస్తం దరఖాస్తులతో అనాధికారికంగా కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులను స్వీకరించడంతో ఆహార భద్రత కార్డులపై అర్హులైన పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్(ఆహార భద్రత)కార్డులను మంజూరు చేయకపోగా, 2016 సంవత్సరంలో ఉన్న రేషన్ కార్డుల నుంచి 90,040 రేషన్ కార్డులను వివిధ కారణాల చూపుతూ.. రద్దు చేసింది. అయినా కలెక్టరేట్‌తో సహా జిల్లాలో ఆర్డీఓ, ఎంపీడీఏ తదితర కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో రేషన్ కార్డుల కోసం వెల్లువలా దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. నిరంతర ప్రక్రియగా ప్రజలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రధాన కారణం ప్రతీ సంక్షేమ పథకానికి లింకు పెట్టడమేనని తెలుస్తోంది.

అనధికార దరఖాస్తుల స్వీకరణతో పెరిగిన ఆశలు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రజాపాలన సభలు నిర్వహిస్తున్నారు. ఈ సభల్లో కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన అంశం లేకపోయినా ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా అనాధికారికంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డులకు సంబంధించి ప్రజాపాలన కార్యక్రమం ద్వారా జిల్లా పౌరసరఫరాల శాఖకు 34,453 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమం ముగిసే వరకు మరో 1.50 లక్షల దరఖాస్తులు రాగలవని సంబంధిత అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలాగే, రేషన్ కార్డుల్లో మ్యుటేషన్(చేర్పులు, మార్పులు)కు సంబంధించి 71 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా పౌరసరఫారాల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

కార్డుల రద్దుకు అప్పట్లో చూపిన కారణాలివే..

రేషన్ కార్డుల రద్దుకు సంబంధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం చూపిన కారణాల్లో ప్రధానంగా ఉపాధి కోసం ప్రజలు వేర్వేరు ప్రాంతాలకు వలస వెళ్లటం.. కుటుంబంలో ఆడపిల్ల వివాహం తర్వాత ఆమె పేరు తొలగించకుండా ఉండటం.. మృతిచెందిన వారి కూడా పేర్లు తొలగించకపోవడం వంటివి పేర్కొంది. ఈ కారణాలతో 2016లో అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ 90,040 రేషన్ కార్డులు రద్దు చేసింది. అప్పటి నుంచి ఆయా రేషన్ కార్డుల లబ్ధిదారులకు నెలవారీగా రేషన్ సరకులు అందడం లేదు. దీంతో నిరుపేద లబ్ధిదారులు ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అయినా బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించకపోవడంతో.. కొందరు లబ్ధిదారులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీంతో సర్వోన్నత న్యాయస్థానం వాటిని మరోసారి పరిశీలించాలని సూచనలిచ్చింది. దీంతో రద్దుచేసిన రేషన్ కార్డు దారుల నుంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిశీలించాలని సంబంధిత అధికారులను అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం రేషన్ కార్డుల పునరుద్ధరణకు సంబంధించి సర్వే ప్రక్రియ చేపట్టినా, సకాలంలో పూర్తి చేయలేకపోయింది.



రద్దయిన కార్డులిక్కడే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 95,040 తెల్లరేషన్ కార్డులు రద్దు కాగా, మండలాలు, జీహెచ్ఎంసీ మున్సిపల్ సర్కిళ్ల వారీగా రద్దయిన తెల్ల రేషన్‌కార్డుల వివరాలు ఇలా ఉన్నాయి. బాచుపల్లి మండలంలో 2,378 తెల్లరేషన్ కార్డులు రద్దు కాగా, ఘట్‌కేసర్‌లో 2,273, కాప్రాలో 2,263, కీసరలో 3,388, మేడ్చల్‌లో 2,306, మేడిపల్లిలో 4,165, శామీర్‌పేట్‌లో 893, మూడు చింతలపల్లి మండలంలో 328 రేషన్ కార్డులు రద్దయ్యాయి. ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో 39,270, బాలానగర్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో 35,210 తెల్ల రేషన్ కార్డులు రద్దయ్యాయి.